సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
మంగళవారం । 21 । నవంబర్ । 2023



సోమశిలలో 29.455 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో సోమవారం సాయంత్రానికి 29.455 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జలాశయానికి పైతట్టు ప్రాంతాల నుంచి 20 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.62,860
22 క్యారెట్లు ఆర్నమెంట్ (గ్రా)	రూ.5,651
3శాతం జీఎస్టీతో	రూ.5,821
నవర (8గ్రా)	రూ.46,568

గరిష్టం/కనిష్టం
28.6 /25.5

వాతావరణం

సోమవారం గాలిలో తేమ 90 శాతం ఉంది. జిల్లావ్యాప్తంగా వర్షం కురిసింది. మంగళవారం కూడా జిల్లాలోని పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలిపింది.

న్యూస్‌రీల్

పెన్నా డెల్టాకు నీరు విడుదల



సోమశిల జలాశయం నుంచి విడుదలవుతున్న నీరు

సోమశిల: సోమశిల జలాశయం నుంచి పెన్నా డెల్టాకు 1,800 క్యూసెక్కుల నీటిని సాగు, తాగునీటి కోసం సోమవారం విడుదల చేశారు. సోమశిల ప్రాజెక్ట్ ఈఈ దశరథరామిరెడ్డి, నెల్లూరు సెంట్రల్ ఈఈ నాగరాజు, నెల్లూరు సెంట్రల్ డిప్యూటీ ఈఈ అనిల్‌కుమార్‌రెడ్డి, సోమశిల జలాశయం ఈఈ రవీంద్రప్రసాద్, జేఈ రామ్మోహన్‌రెడ్డి, నిఖిల్ తదితరులు నీటి విడుదల ప్రక్రియను పర్యవేక్షించారు.

వెబ్‌సైట్‌లో హాల్‌టికెట్లు

నెల్లూరు(టౌన్): 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్) పరీక్ష హాల్‌టికెట్లు www. bse. ap. gov. in వెబ్‌సైట్‌లో ఉంచినట్లు డీఈఓ గంగాభవాని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత ఉపాధ్యాయులు పాఠశాల యూ డైస్ కోడ్‌ను ఉపయోగించి లాగిన్ ద్వారా వారి పాఠశాల విద్యార్థులు హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసి అందజేయాలని తెలిపారు. ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష వచ్చే నెల 3న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరుగుతుందని తెలిపారు.

బాల్యవివాహాలను అరికట్టాలి

- వీఎస్‌యూ వీసీ జీఎం సుందరవల్లి



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వీసీ సుందరవల్లి తదితరులు

వెంకటాచలం: బాలికలను చైతన్యపరిచి బాల్య వివాహాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ జీఎం సుందరవల్లి పేర్కొన్నారు. మండలంలోని కాకుటూరు వద్దనున్న వీఎస్‌యూలో సోమవారం బాలల హక్కుల దినోత్సవం సందర్భంగా బాలల నేస్తం, చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్లకు సంబంధించిన వాల్‌పోస్టర్లను వీసీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భవిష్యత్‌లో బాలల సంరక్షణశాఖ అధికారులతో కలిసి వీఎస్‌యూ ఎన్‌ఎస్‌ఎస్ విభాగం, సోషల్ వర్క్ విభాగం ద్వారా బాలికల్లో చైతన్యం తీసుకువచ్చేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పి.రామచంద్రారెడ్డి, బాలల సంరక్షణ శాఖ అధికారి సురేష్, చైతన్య జ్యోతి వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు శ్రీనివాస్, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఉదయశంకర్ , సోషల్ వర్క్ విభాగం అధ్యాపకులు డాక్టర్ బి.వి.సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నీటిని పొదుపుగా వినియోగించాలి

- డీఏఓ సత్యవాణి



మాట్లాడుతున్న డీఏఓ సత్యవాణి

నెల్లూరు(సెంట్రల్): జిల్లాలో ప్రస్తుతం ఉన్న పరిస్థితులకు అనుగుణంగా సాగు నీటిని పొదుపుగా వాడుకుంటే మంచిదని జిల్లా వ్యవసాయశాఖ అధికారి సత్యవాణి పేర్కొన్నారు. నెల్లూరులోని వ్యవసాయ పరిశోధనా స్థానంలో ఆ శాఖ సిబ్బందికి, గ్రామ వ్యవసాయ సహాయకులకు సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నీటి వృథాను అరికట్టాలని, తక్కువ నీటితో అధిక దిగుబడి సాధించాలని సూచించారు. జిల్లాలో ప్రస్తుతం సాగుకు కావాల్సిన ఎరువులు అందుబాటులో ఉంచుకోవాలని వీఏఏలకు సూచించారు. శాస్త్రవేత్త శ్రీలక్ష్మి మాట్లాడుతూ రైతులకు శాస్త్రవేత్తలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సలహాలు, సూచనలు అందజేస్తారని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ వనరుల కేంద్రం ఏడీ దొరసానమ్మ, శాస్త్రవేత్త వినీత, డీడీ శివన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పర్యవేక్షణ నాస్తి

సకాలంలో పూర్తి కాని సిలబస్

- నాణ్యమైన బోధన అందించడంలో ఉపాధ్యాయుల నిర్లక్ష్యం
- సక్రమంగా నోటుపుస్తకాలు రాయని విద్యార్థులు
- పర్యవేక్షించాల్సిన ఎంఈఓలు కార్యాలయాలకే పరిమితం
- మొక్కుబడిగా డీఈఓ, డిప్యూటీ ఈఓల తనిఖీలు
- విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ తనిఖీల్లో వెలుగుచూసిన అంశాలు

రాష్ట్ర ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేసి నాడు–నేడు కార్యక్రమం ద్వారా సర్కారు బడులను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దింది. ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన చేయాలని, విద్యాశాఖ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని పేర్కొంది. అయితే రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్ శనివారం జిల్లాలోని లింగసముద్రం, ఉలవపాడు, గుడ్లూరు తదితర మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలలను తనిఖీ చేయగా జిల్లా విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయుల డొల్లతనం, నిర్లక్ష్యం కనిపించింది.

- లింగసముద్రం మండలం మొగిలిచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్ తనిఖీ చేశారు. 6వ తరగతి విద్యార్థులను పాఠ్యాంశాల్లో కొన్ని ప్రశ్నలు వేసి వాటి సమాధానాలు నోటు పుస్తకాల్లో రాశారో లేదోనని పరిశీలించారు. కేవలం ఆరుగురు విద్యార్థులు మాత్రమే నోటు పుస్తకాల్లో రాసినట్లు గుర్తించారు.
- లింగసముద్రం మండలం గంగపాళెం మండల పరిషత్ పాఠశాలలో మొత్తం 30 మంది విద్యార్థులు ఉండగా వారికి ఇద్దరు ఉపాధ్యాయులు పాఠాలు బోధిస్తున్నారు. 1వ తరగతి నుంచి 3వ తరగతి చదువుతున్న విద్యార్థుల నోటు పుస్తకాలను రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ తనిఖీ చేయగా ఒక్క విద్యార్థి కూడా నోటు పుస్తకం రాసిన దాఖలాలు లేవు.
- రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ గుడ్లూరు మండలం నరసాపురం ప్రాథమిక పాఠశాలలో 4వ తరగతి విద్యార్థిని ఇంగ్లిషు పుస్తకం చదవమనడంతో ఆ విద్యార్థి సరిగా చదవలేకపోయాడు. మరి కొంతమంది విద్యార్థులకు కొన్ని ప్రశ్నలు వేయగా అతి కొద్ది ప్రశ్నలకు మాత్రమే వారు సమాధానం చెప్పారు. ఈ విషయాలన్నీ ఆయన తనిఖీల్లో బయటపడ్డాయి.



గుడ్లూరు: నరసాపురం ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేస్తున్న ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్ (ఫైల్)

నెల్లూరు(టౌన్): పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదవడమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందుకోసం తొలుత ప్రభుత్వ పాఠశాలల్లో నాడు–నేడు కార్యక్రమం ద్వారా విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించింది. విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫాం, టై, బెల్ట్, షూ, బ్యాగు తదితర సామగ్రి విద్యార్థులకు ఉచితంగా అందిస్తోంది. ఉపాధ్యాయులు నాణ్యమైన బోధన చేసేలా మార్గదర్శకాలు ఇచ్చింది. అయితే ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు ఈ మార్గదర్శకాలను అమలు చేయడంలో విఫలమవుతున్నారు.

సర్కారు బడులు.. కార్పొరేట్ స్థాయి వసతులు

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో నాడు–నేడు కింద తొలి విడతలో 1,070 ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన చోట అదనపు గదులు, మరుగుదొడ్లు, ప్రహరీలు, మినరల్ వాటర్ ప్లాంట్లు, కుర్చీలు, బెంచీలు ఏర్పాటు, గ్రీన్‌చాక్ బోర్డు, స్మార్ట్ టీవీ, తదితర సౌకర్యాలను ఏర్పాటు చేశారు. రెండో విడత నాడు–నేడులో 1,100లకు పైగా ప్రభుత్వ పాఠశాలల్లో నాడు–నేడు పనులు జరుగుతున్నాయి. ఇవి కూడా దాదాపు తుదిదశకు చేరుకున్నాయి. జగనన్న గోరుముద్ద పేరుతో విద్యార్థులకు ప్రతిరోజూ పౌష్టికాహారం అందిస్తోంది. అమ్మఒడి పథకం ద్వారా అర్హులైన ప్రతి విద్యార్థి తల్లి బ్యాంక్ ఖాతాలో రూ.15 వేల నగదు జమ చేస్తోంది. పాఠశాలల్లో 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేసి బైజూస్ సంస్థతో అత్యుత్తమ బోధన అందించేలా చర్యలు తీసుకుంటోంది. అదేవిధంగా ఇంగ్లిషు మీడియం, సీబీఎస్‌ఈ సిలబస్, డిజిటల్ బోధన అమలు చేస్తోంది. ఏ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత లేకుండా మిగులు ఉన్న పాఠశాలల్లోని ఉపాధ్యాయులను కొరత ఉన్న పాఠశాలల్లోకి సర్దుబాటు చేసింది.



తరగతి గదిలో విద్యార్థులు

జిల్లాలో..	
ప్రభుత్వ పాఠశాలలు	- 2,575
ప్రాథమిక	- 2,027
ప్రాథమికోన్నత	- 254
ఉన్నత పాఠశాలలు	- 294
మొత్తం విద్యార్థుల సంఖ్య	- 2.92 లక్షల మందికి పైగా..

నామమాత్రంగా బోధన

పేద విద్యార్థులు చదివే సర్కారు బడుల్లో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో వసతులు కల్పించినా ఉపాధ్యాయులు నామమాత్రంగా విధులు నిర్వహిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. వృత్తి ఉపాధ్యాయుడు, ప్రవృత్తి ఇతర వ్యాపకాలు అన్న చందంగా ఎక్కువ మంది వ్యవహరిస్తున్నారు. జిల్లాలో ఎక్కువ మంది ఉపాధ్యాయులు రియల్ ఎస్టేట్, ఎల్ఐసీ, చీటీలు, వడ్డీ వ్యాపారాలు తదితర వాటిపై పెట్టిన దృష్టి బోధనపై పెట్టడం లేదని ఆరోపణలు ఉన్నాయి. ప్రధానంగా ఉపాధ్యాయుడు తాను పనిచేసే మండల కేంద్రంలో నివాసం ఉండాలని ఉత్తర్వులు ఉన్నాయి. అయితే జిల్లాలోని ఎక్కువ మంది ఉపాధ్యాయులు నెల్లూరు నగరం, కావలి పట్టణాల్లో నివాసం ఉంటూ రోజూ పాఠశాలకు వెళ్లి వస్తున్న పరిస్థితి ఉంది. ఫేస్ రికగ్నైజేషన్ ఏర్పాటు చేసిన తరువాత ఎక్కువ శాతం ఉపాధ్యాయులు పాఠశాలకు వచ్చినా బోధన సక్రమంగా చేయడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రాష్ట్ర విద్యాశాఖ సకాలంలో పరీక్షల నిర్వహణ, సిలబస్ పూర్తయ్యేలా ప్రతి ఏటా అకడమిక్ క్యాలెండర్ రూపొందించింది. ఎంఈఓల నుంచి డిప్యూటీ ఈఓలు, డీఈఓ పర్యవేక్షించాల్సి ఉంది.

మొక్కుబడిగా తనిఖీలు

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలపై పర్యవేక్షణ పూర్తిగా కొరవడిందని పలువురు చెబుతున్నారు. ప్రతి మండలంలో ఇద్దరు ఎంఈఓలు ఉన్నారు. వీరిలో ఒక ఎంఈఓ కేవలం పాఠశాలల్లో విద్యార్థులకు చేస్తున్న బోధన, ఉపాధ్యాయులకు ఇస్తున్న శిక్షణను పర్యవేక్షించాలి. అయితే ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్ పాఠశాలల్లో బోధన సక్రమంగా లేనిదానిపై డీఈఓను ప్రశ్నించగా విజిట్‌లకు వెళ్లడం లేదని చెప్పడం అందరినీ విస్మయానికి గురిచేస్తోంది. ఎంఈఓలు ఏం చేస్తున్నారని ప్రశ్నిస్తే వారు అసలు రిపోర్టులు పంపడం లేదని సమాధానం ఇచ్చారు. డీఈఓ సైతం మొక్కుబడి తనిఖీలు చేస్తున్న పరిస్థితి ఉంది. జిల్లాలో డీఈఓ ఉన్నారా అంటూ ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. వారం రోజుల్లో జిల్లాలోని అన్ని పాఠశాలలపై సమగ్ర రిపోర్టు పంపాలని ఆదేశించారు. ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ హెచ్చరికలతో ఇప్పటికైనా జిల్లా విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు నాణ్యమైన బోధన అందించేలా అడుగులేస్తారా లేక మా దారి మాదే అన్న రీతిలో వ్యవహరిస్తారో వేచి చూడాల్సి ఉంది.

పాఠశాలల విజిట్ తప్పనిసరి



ఎంఈఓ ప్రతిరోజూ రెండు పాఠశాలలను తప్పనిసరిగా విజిట్ చేయాలి. ఆ రిపోర్టును డీఈఓకు పంపాలి. ప్రతి వారం జిల్లాలోని అన్ని పాఠశాలలపై రివ్యూ నిర్వహిస్తాం. ప్రతి విద్యార్థి నోటుబుక్ రాసేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలి. ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే చార్జి మెమోలు జారీ చేస్తాం. ఈ విషయంలో ఎవరినీ ఉపేక్షించం.

– గంగాభవాని, డీఈఓ

సంతృప్తికరంగా సమస్యలు పరిష్కరించాలి



అర్జీదారుడి సమస్యను వింటున్న జేసీ కూర్మనాథ్

- జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్

నెల్లూరు(దర్గామిట్ట): 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో వివిధ సమస్యలపై అర్జీదారులు అందజేసిన అర్జీలను నిర్దిష్ట గడువు లోపు సంతృప్తికరస్థాయిలో పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ ఆర్.కూర్మనాథ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో డీఆర్వో లవన్న, జెడ్పీ సీఈఓ చిరంజీవిలతో కలిసి జేసీ జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో ఒకసారి వచ్చిన అర్జీ మళ్లీ రాకుండా ఆ సమస్యకు పరిష్కారం చూపాలని సూచించారు. కొన్ని ప్రభుత్వ శాఖలకు సంబంధించి వచ్చిన అర్జీలే మళ్లీ వస్తున్నాయని, అలాంటి వినతులపై ప్రత్యేక దృష్టి సారించి సంబంధిత అర్జీదారులను పిలిపించి పరిష్కరించాలని, లేనిపక్షంలో ఏకారణంతో పరిష్కరించలేకపోతున్నామో స్పష్టంగా తెలియజేయాలన్నారు. సోమవారం 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో మొత్తం 260 అర్జీలు అందాయని తెలిపారు. కార్యక్రమంలో మెప్మా, హౌసింగ్, ఐసీడీయస్ పీడీలు రవీంద్ర, నాగరాజు, హేనాసుజన్, జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి వెంకటయ్య, జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులు, డీఎస్‌ఓ వెంకటేశ్వరరావు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి సత్యవాణి తదితర అధికారులు పాల్గొన్నారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

- ప్రభుత్వ పాఠ్యపుస్తకాల ప్రచురణ విభాగం రాష్ట్ర డైరెక్టర్ కె.రవీంద్రనాథ్‌రెడ్డి

గుడ్లూరు: తరగతుల్లో వెనుకబడిన విద్యార్థులకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధతో పాఠ్యాంశాలు బోధించాలని ప్రభుత్వ పాఠ్యపుస్తకాల ప్రచురణ విభాగం రాష్ట్ర డైరెక్టర్ కె.రవీంద్రనాథ్‌రెడ్డి సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, నరసాపురంలోని ప్రాథమిక పాఠశాలలను ఆయన సోమవారం తనిఖీ చేశారు. రెండు పాఠశాలల్లో 3, 4 తరగతుల్లో విద్యార్థుల వర్క్‌బుక్‌లను పరిశీలించి ప్రతి నెలా పాఠ్యాంశాలు పూర్తయిన తరువాత విద్యార్థులతో వర్క్‌బుక్‌ను రాయిస్తున్నారా లేదా అని పరిశీలించారు. నరసాపురం పాఠశాలలో కొంతమంది విద్యార్థులు వర్క్‌బుక్‌లు పూర్తిస్థాయిలో రాయకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ వాటిని పూర్తి చేయించే బాధ్యతలను ఎంఈఓకు అప్పగించారు. గుడ్లూరులో సైన్స్ ల్యాబ్‌ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

అభ్యసన సామర్థ్యం పెంపునకు కృషి

లింగసముద్రం: విద్యార్థుల అభ్యసన సామర్థ్యం పెంపునకు కృషి చేస్తామని ప్రభుత్వ పాఠ్యపుస్తకాల ప్రచురణ విభాగం రాష్ట్ర డైరెక్టర్ రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. మండలంలోని మొగిలిచర్ల, గంగపాళెం, మోడల్ స్కూళ్లు, కేజీబీవీని ఆయన తనిఖీ చేశారు. రవీంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లా, మండల స్థాయి విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు సమష్టిగా కృషి చేసి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల పెంపునకు కృషి చేయాలన్నారు. ఏపీసీ ఉషారాణి, ఏఎంఓ సుధీర్‌బాబు, పుస్తక విభాగం ఒంగోలు మేనేజర్ శివాజీ, డిప్యూటీ ఈఓ శ్రీనివాసులు, ఎంఈఓ రవికుమార్ పాల్గొన్నారు.



మొగిలిచర్ల పాఠశాలలో విద్యార్థులకు సూచనలిస్తున్న రవీంద్రనాథ్‌రెడ్డి

పరిశ్రమల్లో ఆరోగ్యం, భద్రత ముఖ్యం



కర్మాగారాల ప్రతినిధులకు అవగాహన కల్పిస్తున్న చంద్రశేఖర్‌వర్మ

- రాష్ట్ర కర్మాగారాల సంచాలకులు చంద్రశేఖర్‌వర్మ

తోటపల్లిగూడూరు: పరిశ్రమల్లో కార్మికుల ఆరోగ్యం, భద్రత ముఖ్యమని రాష్ట్ర కర్మాగారాల సంచాలకులు చంద్రశేఖర్‌వర్మ సూచించారు. మండలంలోని అనంతపురం గ్రామంలో ఉన్న ఎస్ఈఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్‌లో సోమవారం 'ఫ్యాక్టరీస్ యాక్ట్ – రూల్స్ ఎక్సలెన్స్ కోసం ఓ మార్గం' అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన చంద్రశేఖర్‌వర్మ కర్మాగారాల ప్రతినిధులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల సమయపాలన, వేతన నిబంధనలను పరిశ్రమల యాజమాన్యాలు తప్పనిసరిగా అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఈఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ ఓ అండ్ ఎం హెడ్ సునీల్‌కుమార్ గుప్తా, ఏపీ జెన్‌కో, అదానీ కృష్ణపట్నం పోర్టు, పలు కర్మాగారాలకు చెందిన 60 మంది ప్రతినిధులు పాల్గొన్నారు.

రూ.1200 కోట్లతో గ్రామీణ రోడ్ల నిర్మాణం

- నెల్లూరు ఏఎంసీ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవంలో మంత్రి కాకాణి



ఏఎంసీ నూతన పాలకవర్గంతో మంత్రి కాకాణి, ఎంపీ ఆదాల, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి

నెల్లూరు(సెంట్రల్): రూ.1200 కోట్లతో గ్రామీణ ప్రాంత రోడ్లను పూర్తిస్థాయిలో నిర్మిస్తామని వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. నెల్లూరు వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. నగరంలోని మినీబైపాస్‌లోని జీపీఆర్ కల్యాణ మండపంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డితో కలిసి మంత్రి కాకాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కాకాణి మాట్లాడుతూ వ్యవసాయ మార్కెటింగ్ కమిటీల ద్వారా వచ్చే సెస్‌లు, నాబార్డు నిధులతో గ్రామీణ రోడ్ల నిర్మాణం చేపడుతామని తెలిపారు. మార్కెటింగ్ శాఖలో నూతన విధానాలకు శ్రీకారం చుడుతున్నామని చెప్పారు. రైతులు పండించిన పంటలను ఇంటి నుంచే విక్రయించుకునేలా డిజిటల్ మార్కెటింగ్ సౌకర్యాన్ని కల్పిస్తున్నామని వెల్లడించారు. నెల్లూరు ఏఎంసీ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. సుదీర్ఘకాలంగా రాజకీయాల్లో ఉంటూ మంచి వ్యక్తిగా గుర్తింపు పొందిన పేర్నేటి కోటేశ్వరరెడ్డి ఏఎంసీ చైర్మన్‌గా రైతులకు మంచి సేవలు అందించాలని ఆకాంక్షించారు. రానున్న ఎన్నికల్లో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డికి అన్ని వర్గాల ప్రజలు ఆశీస్సులు అందించి గెలిపించాలని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ రైతులకు సేవ చేసేందుకు మార్కెటింగ్ కమిటీ చైర్మన్ పదవి ఒక మంచి అవకాశం అన్నారు. రైతులకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించాలన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రైతులకు అన్ని విధాలా సహాయసహకారాలు అందిస్తున్నారని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నారని గుర్తు చేశారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించాలని కోరారు. ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ కోసం నిజాయతీగా పని చేస్తే మంచి భవిష్యత్తు ఉంటుందనే దానికి కోటేశ్వరరెడ్డి ఒక నిదర్శనమన్నారు. రానున్న రోజుల్లో మరెన్నో పదవులు పొందాలని ఆకాంక్షించారు.

నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

నెల్లూరు ఏఎంసీ చైర్మన్‌గా పేర్నేటి కోటేశ్వరరెడ్డి, వైస్‌చైర్మన్‌గా ఓట్టూరు సుధాకర్, సభ్యులుగా తగరం మాధవి, రామలింగారెడ్డి శిరీషా, జీ శిరీషా , కొంగర శీనయ్య, బండి చెంచయ్య, తాండ్ర సుజాత, ఈగా విజయమ్మ, తాటిపర్తి వెంకటేశ్వర్లు, బొడ్డు అనిత, స్వర్ణ ప్రసాద్, మంచికంటి శ్రీనివాసులు, ఉప్పు నవిత, ఉప్పు ప్రసన్న ప్రమాణం చేశారు. విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, మేయర్ స్రవంతి, వైఎస్సార్‌సీపీ నేతలు ఆనం విజయకుమార్‌రెడ్డి, మొయిళ్ల గౌరి, మాశం సుధీర్‌కుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ధ్యేయం

- కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి



కనిగిరి రిజర్వాయర్ నుంచి సాగునీరు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్న

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మండలంలోని కనిగిరి రిజర్వాయర్ నుంచి సౌత్‌ఫీడర్, ఈస్ట్రన్ చానళ్లకు సాగునీరు విడుదల చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. సౌత్‌ఫీడర్ చానల్ కింద బుచ్చిరెడ్డిపాళెం, కోవూరు, కొడవలూరు, విడవలూరు మండలాల్లో 26వేల ఎకరాలకు 2.38 టీఎంసీల నీటిని కేటాయించినట్లు తెలిపారు. ఈస్ట్రన్ చానల్ కింద బుచ్చిరెడ్డిపాళెం, కొడవలూరు, విడవలూరు మండలాల్లోని సుమారు 45 వేల ఎకరాలకు 4.40 టీఎంసీలను కేటాయించినట్లు వివరించారు. ఇందుకూరుపేట ఆయకట్టుకు 1.5 టీఎంసీలను కేటాయించారని, 15వేల ఎకరాల సాగుకు అవకాశం ఉందని తెలిపారు. వర్షాభావ పరిస్థితులతో నీటి లభ్యత తక్కువ ఉన్న విషయాన్ని రైతులు దృష్టిలో ఉంచుకుని ఇరిగేషన్, వ్యవసాయ అధికారుల సూచనలు పాటించి పొదుపుగా వాడుకోవాలని సూచించారు.

పచ్చనేతల ఎన్నికల డ్రామాలు

ఇటీవల జరిగిన ఐఏబీ సమావేశ సమయంలో కొందరు పచ్చనేతలు నిరసనలు తెలిపారని, అసలు ఎందుకు నిరసనలు తెలిపారో వారికే అర్థం కాని పరిస్థితి అని ఎమ్మెల్యే విమర్శించారు. ఆరు నెలల్లో ఎన్నికలు జరగనుండడంతో టీడీపీ నేతలకు ఐఏబీ సమావేశం, రైతులు గుర్తుకొచ్చారన్నారు. గతంలో 8 సార్లు ఐఏబీ సమావేశం ఏర్పాటు చేసి రైతులకు నీరందించడం జరిగిందన్నారు. ఆ సమయంలో ఎప్పుడూ పచ్చనేతలు రోడ్ల మీద కనపడలేదన్నారు. కేవలం ఎన్నికల సమయంలో నీరు విడుదల చేయాలని రైతులపై కపట ప్రేమచూపటం సరికాదన్నారు. టీడీపీ ఎన్ని డ్రామాలు వేసినా ప్రజలు పట్టించుకునే పరిస్థితి లేదన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో తమ ప్రభుత్వం రైతు సంక్షేమానికి కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. రాష్ట్ర వ్యవసాయ సలహామండలి సభ్యుడు దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి, డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతి, నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, కౌన్సిలర్ లలితారెడ్డి, వైఎస్సార్‌సీపీ టౌన్, రూరల్ కన్వీనర్లు టీ మల్లికార్జునరెడ్డి, సీహెచ్ సతీష్‌రెడ్డి, నాయకులు యర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల ప్రయోజనాలే లక్ష్యం

- తీరంలో నిఘా కోసం మెకనైజ్డ్ బోటు ప్రారంభం
- తమిళనాడు, పుదుచ్చేరి బోట్లు వేట సాగించకుండా పటిష్ట చర్యలు
- కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి



జువ్వలదిన్నె తీరంలో నిఘా కోసం మెకనైజ్డ్‌బోటును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి

బిట్రగుంట: కావలి నియోజకవర్గంలోని తీరప్రాంత మత్స్యకారుల ప్రయోజనాలే లక్ష్యంగా ఇతర రాష్ట్రాలకు చెందిన మెకనైజ్డ్ బోట్లు వేట సాగించకుండా పటిష్ట చర్యలు చేపడుతున్నామని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మండలంలోని జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌లో మత్స్యకార గ్రామాల కాపులతో కలిసి మెకనైజ్డ్ నిఘా బోటును సోమవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఫిషింగ్ హార్బర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామిరెడ్డి మాట్లాడుతూ తమిళనాడు, పుదుచ్చేరి ప్రాంతాలకు చెందిన వారు కావలి తీరం వరకు చొచ్చుకొచ్చి పెద్దతరహా మెకనైజ్డ్ బోట్లలో వేట సాగిస్తుండడంతో స్థానిక మత్స్యకారుల వలలు దెబ్బతినడమే కాకుండా మత్స్యసంపద దొరకడం లేదని తెలిపారు. ఈ విషయంలో తరచూ స్థానిక, ఇతర రాష్ట్రాలకు చెందిన మత్స్యకారుల నడుమ వివాదాలు నెలకొంటున్నాయన్నారు. ఈ సమస్యను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, వెంటనే స్పందించి తీరంలో నిఘా కోసం రూ.50 లక్షలతో ప్రత్యేకంగా మెకనైజ్డ్ బోటును కేటాయించారని వివరించారు. కావలి నియోజకవర్గంలో సుమారు 47 కిలోమీటర్ల తీరప్రాంతం ఉండగా వేలాది మత్స్యకార కుటుంబాలు సముద్రంలో వేటపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాయని తెలిపారు. ఈ కుటుంబాలకు ప్రభుత్వ పథకాలు అందించడంతో పాటు తీరంలో మెరుగైన వసతులు కల్పిస్తున్నామని చెప్పారు. వేట నిషేధ సమయంలో ప్రతికుటుంబానికి రూ.10వేల పరిహారంతో పాటు రూ.10 లక్షల ప్రమాద బీమా అందజేస్తున్నామని వివరించారు.

త్వరలో సీఎం చేతుల మీదుగా ఫిషింగ్ హార్బర్ ప్రారంభం

జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ నిర్మాణ పనులను ఏడాదిన్నర కాలంలోనే 90 శాతం మేర పూర్తి చేశామని ఎమ్మెల్యే రామిరెడ్డి తెలిపారు. త్వరలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభిస్తామని చెప్పారు. ఫిషింగ్‌హార్బర్ అందుబాటులోకి వస్తే తీర ప్రాంత రూపురేఖలు మారిపోతాయన్నారు. హార్బర్‌లో ఐస్‌ఫ్యాక్టరీలు, కోల్డ్‌స్టోరేజ్‌లు, చేపలు ఆరబెట్టుకునేందుకు, విక్రయాలకు వీలుగా ప్లాట్‌ఫామ్‌ల నిర్మాణం చేపడుతామని, తద్వారా మత్స్యకారుల ఆదాయం రెట్టింపు అవుతుందన్నారు. జువ్వలదిన్నె ఫిషింగ్‌హార్బర్‌తో పాటు రామాయపట్నం పోర్టు ద్వారా మత్స్యకారులకే కాకుండా భూముల ధరలు పెరిగి రైతులు, అనుబంధ పరిశ్రమల ద్వారా ఉపాధి అవకాశాలతో యువతకు మేలు జరుగుతుందని వివరించారు. కావలి ఏఎంసీ చైర్మన్ సన్నిబోయిన ప్రసాద్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మద్దిబోయిన వీరరఘు, మత్స్యకార నాయకులు కొండూరు శ్రీనివాసులు, బీద రమేష్, కావలి రూరల్ మండల జేసీఎస్ కన్వీనర్ శ్రీనివాసులు, స్థానిక సర్పంచ్ గోవిందస్వామి, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

శిక్షణా శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న డైట్ ప్రిన్సిపల్ రమేష్

వెంకటాచలం: తెలుగు పరీక్షల మూల్యాంకనంపై ఆరు రోజుల పాటు నిర్వహిస్తున్న శిక్షణా శిబిరాన్ని ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని పల్లెపాడు డైట్ కళాశాల ప్రిన్సిపల్ పీ రమేష్ సూచించారు. మండలంలోని సరస్వతీనగర్ వద్ద ఉన్న ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రంలో భారతీయ పరీక్ష సేవా కేంద్రం, భారతీయ భాషా సంస్థ(మైసూరు) ఆధ్వర్యంలో తెలుగు పరీక్షలు, మూల్యాంకనం, ప్రశ్నావళి రచనపై ఉపాధ్యాయులకు ఆరు రోజుల పాటు నిర్వహిస్తున్న శిక్షణా శిబిరం సోమవారం ప్రారంభమైంది. తొలిరోజు పీ రమేష్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. శిక్షణ శిబిరానికి ఉపాధ్యాయులు నిత్యం హాజరై పరీక్షల మూల్యాంకనంపై స్పష్టమైన అవగాహన పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం డైరెక్టర్ మాడభూషి సంపత్ కుమార్, భారతీయ భాషా సంస్థ రీసోర్స్‌పర్సన్ డాక్టర్ ఎం.నారాయణ రెడ్డి, అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మనస్తాపంతో వృద్ధుడి ఆత్మహత్య




ఫకీర్‌సాహెబ్ మృతదేహం

ఆత్మకూరు: ఇద్దరు కుమారులు ఉన్నా చూడడం లేదని మనస్తాపానికి గురైన ఓ వృద్ధుడు పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆత్మకూరు ఆర్డీఓ కార్యాలయం వద్ద సోమవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలు..ఉదయగిరికి చెందిన ఫకీర్‌సాహెబ్ (75)కు ఇద్దరు కుమారులు. భార్య పేరుపై ఉన్న ఇంట్లోని ఓ పోర్షన్‌లో ఫకీర్‌సాహెబ్, మరో పోర్షన్‌లో పెద్ద కొడుకు ఖాదర్ బాషా ఉంటున్నారు. రెండేళ్ల క్రితం భార్య మృతి చెందగా పక్కనే ఉన్న పెద్దకొడుకు వద్దకు చేరాడు. ఆటోతో జీవనం సాగించే పెద్ద కొడుకు తనకు సరిగా అన్నం పెట్టడంలేదని, తన భార్య పేరుపై ఉన్న ఇంట్లో నుంచి కుమారుడు ఖాళీ చేసి వెళ్తే అద్దెకు ఇచ్చుకుని జీవనం సాగిస్తానని ఫకీరుసాహెబ్ ఆరు నెలల క్రితం ఉదయగిరి తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశాడు. అప్పట్లో తహసీల్దార్ తండ్రి, కొడుకులను పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించాడు. అయినా కొడుకు సరిగా పట్టించుకోకపోవడంతో మర్రిపాడు మండలం డీసీపల్లిలో మెకానిక్‌గా పనిచేస్తున్న రెండో కుమారుడి వద్దకు చేరాడు. ఈ క్రమంలో తనకు సరిగా న్యాయం జరగలేదని, తన ఇల్లు తనకు దక్కేలా చేయాలని సోమవారం సాయంత్రం ఆత్మకూరుకు చేరుకుని ఆర్డీఓ మధులతకు అర్జీ అందజేశారు. స్పందించిన ఆర్డీఓ ఉదయగిరి తహసీల్దార్‌కు ఫోన్ చేసి వృద్ధుడికి న్యాయం చేయాలని ఆదేశించారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయంలో నుంచి వెలుపలికి వచ్చిన ఫకీర్‌సాహెబ్ తీవ్ర మనస్తాపానికి గురై తన వెంట తెచ్చుకున్న పురుగుల మందుతాగి స్పృహతప్పి పడిపోయాడు. సమాచారం తెలుసుకున్న ఆత్మకూరు సీఐ జీ వేణు, ఎస్సై కే ముత్యాలరావు హుటాహుటిన వృద్ధుడ్ని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఫకీర్‌సాహెబ్ మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

23న ఉమ్మడి నెల్లూరు జిల్లా మహిళా కబడ్డీ జట్టు ఎంపిక

కావలి: పట్టణంలోని మినీ స్టేడియంలో ఈ నెల 23న ఉమ్మడి నెల్లూరు జిల్లా మహిళా కబడ్డీ జట్టు ఎంపికలు నిర్వహించనున్నట్లు ఉమ్మడి నెల్లూరు జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ నగళ్ల శ్రీనివాసకిరణ్, అధ్యక్షుడు గద్దే వెంకటేశ్వర్లు, కార్యదర్శి వీ శ్రీనివాసులు, సంయుక్త కార్యదర్శి ఆర్ కృష్ణమూర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 3 గంటలకు జరిగే ఎంపికలకు మహిళా కబడ్డీ క్రీడాకారిణులు హాజరుకావాలని కోరారు. ఎంపికైన వారు ఈ నెల 29 నుంచి కర్నూలు జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు. వివరాలకు 94405 03548, 92989 50860 నంబర్లను సంప్రదించాలని సూచించారు.


త్రుటిలో తప్పిన పెను ప్రమాదం



రోడ్డు ప్రమాదంలో పాక్షికంగా దెబ్బతిన్న బస్సు

సంగం: మండలంలోని గాంధీజనసంఘం మలుపు వద్ద సోమవారం త్రుటిలో పెనుప్రమాదం తప్పింది. నెల్లూరు నుంచి సంగం వైపు వస్తున్న ఆర్టీసీ బస్సును ఎదురుగా వస్తున్న లారీ అదుపుతప్పి ముందుభాగంలో ఓ పక్కగా ఢీకొంది. అనంతరం ముందు వెళ్తున్న కారును ఢీకొంది. దీంతో కారు అదుపుతప్పి బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. వాహనాలు మాత్రంగా పాక్షికంగా దెబ్బతిన్నాయి. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు చేపట్టారు. ప్రమాదంపై వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు.

నిమ్మధరలు
పొదలకూరు (కిలో)
పెద్దవి: రూ. 45
సన్నవి: రూ. 25
పండ్లు: రూ. 8



నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్:	రూ.97	స్కిన్‌లెస్ చికెన్:	రూ.200
లేయర్	రూ.105		
బ్రాయిలర్ చికెన్:	రూ.180	లేయర్ చికెన్:	రూ.178

సాక్షి బిజినెస్
మంగళవారం
21-11-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
140	38
65,655	19,694

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	14,246	△	121
డోజోన్స్	35,072	△	125
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,496	▽	8
డాక్స్	15,901	▽	18
షాంఘై	3,068	△	14
నికాయ్	33,388	▽	197

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	60,888
బంగారం (99.5 స్వచ్ఛత)	60,644
వెండి (కిలో)	72,561

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.52	84.19
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	102.38	105.73
€	యూరో	ఎస్‌బీఐ	89.52	92.61
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	55.11	56.80
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.39	55.74
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	59.89	64.58
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.27	22.89
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.79	23.59
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.51	12.58

నష్టాలొస్తున్నా ఫ్యూచర్స్ ట్రేడింగ్

ఇన్వెస్టర్ల తీరుపై సెబీ చైర్‌పర్సన్ మాధవి పురి ఆశ్చర్యం



బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో ఇన్వెస్టర్ రిస్క్ రిడక్షన్ యాక్సెస్ (ఐఆర్ఆర్ఏ) ప్లాట్‌ఫామ్‌ను ప్రారంభిస్తున్న బీఎస్ఈ చైర్‌పర్సన్ ఎస్ఎస్ ముంద్రా, ఎండీ, సీఈఓ సుందరరామన్ రామమూర్తితో సెబీ చైర్‌పర్సన్ మాధవి పురి బుచ్

ముంబై: ఫ్యూచర్స్, ఆప్షన్స్ విభాగంలో 90 శాతం మంది నష్టపోతున్నా.. ఇన్వెస్టర్లు మాత్రం డెరివేటివ్స్‌నే ఇష్టపడుతుండటం ఆశ్చర్యం కలిగిస్తోందని మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ చైర్‌పర్సన్ మాధవి పురి బుచ్ వ్యాఖ్యానించారు. ఇన్వెస్టర్లు దీర్ఘకాలిక దృష్టితో మదుపు చేయాలని, తద్వారా ద్రవ్యోల్బణాన్ని మించి రాబడులు అందుకోవడానికి అవకాశం ఉంటుందని ఆమె పేర్కొన్నారు. బీఎస్ఈలో ఇన్వెస్టర్ రిస్క్ రిడక్షన్ యాక్సెస్ (ఐఆర్ఆర్ఏ) ప్లాట్‌ఫాంను ఆవిష్కరించిన సందర్భంగా బుచ్ ఈ విషయాలు తెలిపారు. సెబీ ఇటీవల నిర్వహించిన అధ్యయనంలో ఎఫ్అండ్ఓ సెగ్మెంట్‌లో ట్రేడింగ్ చేసిన 45.24 లక్షల మందిలో కేవలం 11 శాతం మంది మాత్రమే లాభాలు ఆర్జించినట్లు వెల్లడైందని ఆమె చెప్పారు. పరిస్థితులు తమకు అనుకూలంగా ఉండవని తెలిసీ చాలా మంది ఇన్వెస్టర్లు డెరివేటివ్స్‌పై బెట్టింగ్ చేస్తుండటమనేది తనకు కాస్త గందరగోళ వ్యవహారంగా అనిపిస్తుందని బుచ్ చెప్పారు. ప్రతిరోజూ ఎఫ్అండ్ఓ సెగ్మెంట్‌లో డబ్బులు పోగొట్టుకోవడం కన్నా పెట్టుబడుల విషయంలో దీర్ఘకాలికమైన, నిలకడైన వ్యూహాన్ని పాటించడం శ్రేయస్కరమని, తద్వారా సంపదను సృష్టించుకోవడానికి అవకాశాలు ఎక్కువగా ఉంటాయని ఆమె వివరించారు.

ఐఆర్ఆర్ఏతో పొజిషన్ల స్క్వేర్ ఆఫ్..

బ్రోకరేజీ సిస్టమ్‌లో అంతరాయం ఏర్పడ్డ పక్షంలో ట్రేడరు తమ ఓపెన్ పొజిషన్లను స్క్వేర్ ఆఫ్ చేసుకునేందుకు ఐఆర్ఆర్ఏ ప్లాట్‌ఫాం ఉపయోగపడుతుంది. పరిశ్రమ వర్గాల ప్రకారం బ్రోకరేజ్ సిస్టమ్ పనిచేయకపోతే ఐఆర్ఆర్ఏని డౌన్‌లోడ్ చేసుకునేందుకు ట్రేడర్‌కి ఎస్ఎంఎస్ వస్తుంది. దాన్ని ఉపయోగించుకుని రెండు గంటల వ్యవధిలోగా ట్రేడరు తమ ఓపెన్ పొజిషన్స్‌ను స్క్వేర్ ఆఫ్ చేసుకోవచ్చు.

రెండో రోజూ మార్కెట్ డీలా

సెన్సెక్స్ 140 పాయింట్లు డౌన్ • 65,655 వద్ద ముగింపు • నిఫ్టీ 38 పాయింట్లు మైనస్

వరుసగా రెండో రోజు దేశీ స్టాక్ మార్కెట్లు డీలా పడ్డాయి. విదేశీ **పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల(ఎఫ్‌పీఐలు) నిరంతర అమ్మకా**లు ప్రభావం **చూపాయి. ఆటో, యుటిలిటీ, కమోడిటీ షేర్లు అమ్మ**కాల ఒత్తిడికి **లోనయ్యాయి. వెరసి సెన్సెక్స్ 140 పాయింట్లు క్షీణించి** 65,655 వద్ద **ముగిసింది. నిఫ్టీ 38 పాయింట్ల నష్టంతో 19,694 వ**ద్ద స్థిరపడింది. **ఆద్యంతం హెచ్చుతగ్గుల మధ్య కదిలిన మార్కెట్లు** చివరికి **అమ్మకాలదే పైచేయి కావడంతో వెనకడు**గు వేశాయి. **వెరసి సెన్సెక్స్ 65,844 పాయింట్ల** వద్ద గరిష్టాన్ని **తాకగా.. 65,548 స్థాయిలో** కనిష్టాన్నీ చవి **చూసింది. ఇది 247 పా**యింట్ల నష్టం **కాగా.. ఇంట్రాడేలో** నిఫ్టీ సైతం **19,756–19,670 పా**యింట్ల మధ్య **ఊగిసలాడింది.** దీర్ఘకాలంగా **బలపడుతున్న** వడ్డీ రేట్లు, **ప్రపంచ ఆర్థి**క మందగమ**నంపై ఆం**దోళనలు అ**మ్మకాలకు** దారి చూపు**తున్నట్లు** మార్కెట్ **విశ్లేష**కులు అభిప్రా**య**పడ్డారు.

ఐటీ ప్లస్‌లో

ఎన్ఎస్ఈలో ప్రధానంగా ఆటో, మీడియా, మెటల్, ఎఫ్ఎంసీజీ. రియల్టీ రంగాలు 0.8–0.3 శాతం మధ్య డీలా పడగా.. ఐటీ 0.6 శాతం పుంజుకుంది. నిఫ్టీ దిగ్గజాలలో అదానీ ఎంటర్, బజాజ్ ఫైనాన్స్, ఎంఅండ్ఎం, ఎస్‌బీఐ లైఫ్, అల్ట్రాటెక్, బజాజ్ ఫిన్, టాటా మోటార్స్, ఏషియన్ పెయింట్స్, అదానీ పోర్ట్స్, హెచ్‌యూఎల్, యూపీఎల్, టాటా స్టీల్, జేఎస్‌డబ్ల్యూ 2.6–1 శాతం మధ్య నష్టపోయాయి. ఇతర బ్లూచిప్స్‌లో డివీస్, ఎయిర్‌టెల్, విప్రో, హెచ్‌సీఎల్ టెక్, కోల్ ఇండియా, ఓఎన్‌జీసీ, టెక్‌మహీంద్రా 2–0.7 శాతం మధ్య లాభపడ్డాయి.

చిన్న షేర్లు ఓకే

బీఎస్ఈలో మిడ్ క్యాప్ ఇండెక్స్ యథాతథంగా నిలిస్తే.. స్మాల్ క్యాప్ 0.4 శాతం బలపడింది. ట్రేడైన షేర్లలో 1,997 నీరసించగా.. 1,840 పుంజుకున్నాయి. నగదు విభాగంలో వారాంతాన రూ. 478 కోట్ల విలువైన షేర్లు విక్రయించిన ఎఫ్‌పీఐలు తాజాగా మరో రూ. 646 కోట్ల పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారు. అయితే దేశీ ఫండ్స్(డీఐఐలు) స్వల్పంగా రూ. 78 కోట్ల విలువైన స్టాక్స్ కొనుగోలు చేయడం గమనార్హం!



రూపాయి రికార్డ్ కనిష్టం



డాలరుతో మారకంలో దేశీ కరెన్సీ చరిత్రాత్మక కనిష్టానికి చేరింది. ఇంటర్‌బ్యాంక్ ఫారెక్స్ మార్కెట్లో డాలరుతో మారకంలో 12 పైసలు కోల్పోయి 83.38 వద్ద ముగిసింది. ఇది సరికొత్త కనిష్టంకాగా.. ఇంతక్రితం ఈ నెల 13న 83.33 వద్ద నిలవడం ద్వారా లైఫ్‌టైమ్ కనిష్టానికి చేరింది. కాగా.. వారాంతాన రూపాయి 83.26 వద్ద నిలవగా.. తాజాగా 83.25 వద్ద స్థిరంగా ప్రారంభమైంది. ఆపై బలహీనపడుతూ చివరికి 83.38కు చేరింది. అయితే ఆరు ప్రధాన కరెన్సీలతో మారకంలో డాలరు 0.4 శాతం నీరసించి 103.48 వద్ద కదులుతున్నప్పటికీ ముడిచమురు బలపడటం, విదేశీ ఇన్వెస్టర్ల అమ్మకాలు ప్రభావం చూపినట్లు ఫారెక్స్ వర్గాలు పేర్కొన్నాయి. లండన్ మార్కెట్లో బ్రెంట్ చమురు బ్యారల్ 0.75 శాతం పెరిగి 81.21 డాలర్లకు చేరింది. ఇక మరోవైపు ఈ నెల 10కల్లా దేశీ విదేశీ మారక నిల్వలు 46.2 కోట్ల డాలర్లు తగ్గి 590.32 బిలియన్ డాలర్లకు చేరాయి.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

21-11-2023	
విశాఖ	535–00
చిత్తూరు	603–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	535–00
విజయవాడ	535–00
రిటైల్ ధర (డజను)	72.00
20-11-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	535–00
వరంగల్	537–00
రిటైల్ ధర	5.95

కెనరా బ్యాంక్ నుంచి కొత్త ఉత్పత్తులు

118వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ప్రారంభం


ఎండీ, సీఈవో
కె. సత్యనారాయణ రాజు

హైదరాబాద్: ప్రభుత్వరంగ **కెన**రా బ్యాంక్ **118**వ వ్యవస్థాపక **దినో**త్సవం సందర్భంగా పలు కొత్త **ఉత్పత్తు**లను కస్టమర్లకు **అందుబా**టులోకి తీసుకొచ్చింది. **కెన**రా బ్యాంక్ ఎండీ, **సీఈవో కె.** సత్యనారాయణ **రాజుతోపాటు** బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ **డైరెక్టర్లు** ఈ ఉత్పత్తులను **ఆవిష్కరించారు. కా**ర్పొరేట్ కస్టమర్ల **కోసం ప్రత్యేకంగా** 'కార్పొరేట్ ఏఐ1' అనే సేవను ప్రారంభించింది. ఇందులో **భాగంగా ఇంటర్నెట్ బ్యాంకింగ్**‌తోపాటు, ప్రత్యేకంగా 'కెనరా ఏఐ1 కార్పొరేట్' అనే **యాప్ ద్వారా లావాదేవీలు నిర్వహిం**చుకోవచ్చు. అలాగే, 18 రకాల సేవలను వాట్సాప్ **బ్యాంకింగ్ చానల్ ద్వారా అందిస్తున్న**ట్లు ప్రకటించింది. కస్టమర్లు 9076030001 అనే **వాట్సాప్ నంబర్‌కు హాయ్/హెలో అని** మెస్సేజ్ పంపడం ద్వారా, కావాల్సిన సేవను పొం**దొచ్చు**. అలాగే, కెనరా యూపీఐ 123 పే పేరుతో ఫీచర్ **ఫోన్లను** వినియోగిస్తున్న వారి కోసం ఐవీఆర్ ఆధారిత **యూపీ**ఐ సేవను సైతం కెనరా బ్యాంక్ తీసుకొచ్చింది. ఏ **బ్యాంక్** ఖాతాదారులు అయినా 'కెనరా యూపీఐ 123 పే' **సేవల**ను వినియోగించుకోవచ్చని ప్రకటించింది.



పోస్టాఫీసుల్లో బ్లూడార్ట్ డిజిటల్ లాకర్ సేవలు





న్యూఢిల్లీ: భారతీయ తపాలా శాఖతో బ్లూడార్ట్ ఒప్పందం చేసుకుంది. ఇందులో భాగంగా ఎంపిక చేసిన తపాలా కార్యాలయాల్లో బ్లూడార్ట్ డిజిటల్ లాకర్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. దీనివల్ల పార్సిల్ పొందాల్సిన వ్యక్తి రోజులో 24 గంటల్లో ఎప్పుడైనా డిజిటల్ లాకర్ వద్దకు వెళ్లి తీసుకోవడానికి అవకాశం ఉంటుందని బ్లూడార్ట్ ప్రకటించింది. ఎలాంటి సంతకాలతో పనిలేదని పేర్కొంది. పోస్టాఫీస్‌తో వ్యూహాత్మక ఒప్పందంలో భాగంగా ఎంపిక చేసిన పోస్టాఫీసుల్లో ఆటోమేటెడ్ డిజిటల్ పార్సిల్ లాకర్స్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపింది. లాకర్లలో పార్సిల్స్ సురక్షితంగా ఉంటాయని, తమకు కేటాయించిన కోడ్‌ను నమోదు చేయడం ద్వారా సులభంగా ప్యాకేజీను పొందొచ్చని వివరించింది. కేవలం గుర్తింపు ఉన్న వ్యక్తే వీటిని పొందగలరని తెలిపింది. కస్టమర్లు తమ వీలు ప్రకారం ప్యాకేజీలను పొందే అవకాశం కల్పించడమే ఇందులోని ఉద్దేశంగా బ్లూడార్ట్ ఎండీ బాల్‌ఫోర్ మాన్యుయేల్ ప్రకటించారు.

వృద్ధి స్పీడ్‌కు 'ఎన్నికల' అడ్డంకి

- 2024 ఎకానమీ అంచనా తగ్గించిన గోల్డ్‌మన్ శాక్స్
- 6.4 శాతం నుంచి 6.3 శాతానికి..



ముంబై: భారత్ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) 2024 వృద్ధి అంచనాలను అమెరికన్ బ్రోకరేజ్ సంస్థ 10 బేసిస్ పాయింట్లు తగ్గించింది. 2023లో తొలి 6.4 శాతం అంచనాలను తాజాగా 6.3 శాతానికి తగ్గిస్తున్నట్లు తాజా నివేదికలో పేర్కొంది. ఎన్నికల సంవత్సరం అనిశ్చితి నెలకొనే అవకాశం తన తాజా అంచనాలకు కారణంగా పేర్కొంది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో 6.2 శాతం, 2024–25 ఆర్థిక సంవత్సరంలో 6.5 శాతం వృద్ధి నమోదవుతుందని సంస్థ అంచనావేసింది. ఇక 2024లో వినియోగ ధరల సూచీ (సీపీఐ) ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణం 5.1 శాతంగా ఉంటుందన్నది శాక్స్ అంచనా. 2023లో ఈ అంచనా 5.7 శాతంగా పేర్కొంది. 2025 తొలి నెలల్లోపు ఆర్‌బీఐ రెపో రేటు ప్రస్తుత 6.5 శాతం నుంచి అరశాతం తగ్గుతుందన్నది గోల్డ్‌మన్ శాక్స్ అంచనా. డాలర్ మారకంలో రూపాయి విలువ 2023లో సగటును 83గా ఉంటే, 2024లో 82కు బలపడుతుందని శాక్స్ నివేదిక పేర్కొంది.

ఏపీకి జగనే ఎందుకు కావాలంటే.. వివరించే కార్యక్రమంలో భాగంగా..


తిరుపతి జిల్లా గూడూరులో సంక్షేమ పథకాల వివరాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు


కృష్ణా జిల్లా పామర్రులో అభివృద్ధి పనులకు సంబంధించిన బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్


అంబేడ్కర్ కోనసీమ జిల్లా భట్నవిల్లిలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు,కార్యకర్తలు


వైఎస్సార్ జిల్లా పైడికాలువలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పి. రవీంద్రనాథరెడ్డి


పశ్చిమగోదావరి జిల్లా ప్రాతాళ్లమెరకలో సంక్షేమ పథకాలపై లబ్ధిదారులతో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ నరసింహరాజు

విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో

భారీ అగ్ని ప్రమాదం

- ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి
- బాధితులను ఉదారంగా ఆదుకోవాలని.. అధికారులకు ఆదేశం


మంటలను అదుపుచేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

సాక్షి, విశాఖపట్నం: విశాఖపట్నం షిప్పింగ్ హార్బర్‌లో ఆదివారం రాత్రి ఘోర అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఓ బోటులో అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో ఈ దుర్ఘటన జరిగింది. ఈ ప్రమాదంలో మొత్తం 45 బోట్లు కాలిపోయాయి. ఉద్దేశ్యపూర్వకంగానే కొందరు మద్యం మత్తులో ఈ బోట్లకు నిప్పు పెట్టినట్టు పోలీసులు ప్రాథమికంగా అనుమానించినప్పటికీ అది నిర్ధారణ కాలేదు. ప్రమాద సమాచారం తెలిసిన వెంటనే సీఎం జగన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. బాధిత మత్స్యకారులను ఆదుకునే విషయంలో ఆయన చాలా ఉదారంగా స్పందించారు. దగ్ధమైన బోట్ల విలువలో 80 శాతం మేర పరిహారంగా అందించాల్సిందిగా అధికారులను ఆదేశించారు. అలాగే, ఈ ఘటనపై లోతైన దర్యాప్తు జరిపి కారణాలు వెలికితీయాలన్నారు.

ప్రమాదవశాత్తూ దుర్ఘటన..

తొలుత.. ఆదివారం అర్ధరాత్రి కొంతమందితో కలిసి ఓ యూట్యూబర్ హార్బర్‌లోని జీరో నెంబర్ జెట్టీలో లంగరు వేసి ఉన్న బోటులో మందు పార్టీ చేసుకున్నాడని, వారిలో వారికి గొడవ మొదలై నిప్పు పెట్టడంతో ఈ ప్రమాదం జరిగిందని అనుమానించారు. అలాగే, యూట్యూబర్‌కు చెందిన బోటును మరొకరికి అమ్మారని, కొనుగోలు చేసిన వ్యక్తి ఆ సొమ్మును సకాలంలో ఇవ్వకపోవడంతో బోటును తగులబెడ్తానని కొన్నాళ్లుగా హెచ్చరిస్తున్నాడని, అలా ఆదివారం అర్ధరాత్రి అన్నంత పనీ చేశాడన్న ప్రచారం కూడా జరిగింది. సంఘటన స్థలంలో ఉండి తగలబడిపోతున్న బోట్లను తన సెల్‌ఫోన్లో యూట్యూబర్ చిత్రీకరించి తన యూట్యూబ్‌లో ఉంచడం కూడా ఈ అనుమానాలకు బలం చేకూరింది. దీంతో పోలీసులు ఆ యూట్యూబర్‌తో పాటు మరొకరిని అదుపులోకి తీసుకున్నారు. ప్రాథమిక విచారణలో అది నిర్ధారణ కాకపోవడంతో ప్రమాదవశాత్తూ అగ్నిప్రమాదం సంభవించిందని పోలీసులు కేసు నమోదు చేశారు. మరోవైపు.. ఈ జెట్టీలో 10 రోజుల క్రితం వరకు సీసీ కెమేరాలు ఉండేవి. కానీ, హార్బర్ ఆధునీకరణ పనుల కారణంగా వీటిని తొలగించారు. దీంతో ఘటనపై దర్యాప్తునకు ప్రతిబంధకంగా మారింది.

45 మెకనైజ్డ్ బోట్లు అగ్నికి ఆహుతి..

ఈ ప్రమాదంలో మొత్తం 45 మెకనైజ్డ్ బోట్లు దగ్ధమైనట్లు అధికారులు గుర్తించారు. వీటిలో 36 బోట్లు పూర్తిగాను, తొమ్మిది బోట్లు పాక్షికంగాను దగ్ధమయ్యాయి. కొన్ని బోట్లు పూర్తిగా నీటిలో మునిగిపోగా మరికొన్ని వాటి ఆనవాళ్లు మాత్రమే కనిపిస్తున్నాయి. ఇక సోమవారం తెల్లవారుజామున వేటకు వెళ్లడానికి సిద్ధంగా ఉన్న బోట్లు, వేటకు వెళ్లి హార్బర్‌కు వచ్చిన బోట్లు కూడా ప్రమాదానికి గురయ్యాయి. ఈ బోట్లలో ఉన్న వేల లీటర్ల డీజిల్, టన్నుల కొద్దీ వేటాడి తెచ్చిన చేపలు, రొయ్యలు అగ్నికి ఆహుతయ్యాయి. ఒక్కో బోటు విలువ దాని స్థితిని బట్టి రూ.25 నుంచి 60 లక్షల వరకు ఉంటుందని అంచనా. ఈ లెక్కన అగ్నిప్రమాదంతో కోట్లాది రూపాయల నష్టం వాటిల్లినట్టు భావిస్తున్నారు.

అప్రమత్తమైన యంత్రాంగం

ప్రమాద వార్త తెలుసుకున్న వెంటనే విశాఖ జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. అందుబాటులో ఉన్న అగ్నిమాపక శకటాలను హుటాహుటిన ఘటనా స్థలానికి తరలించింది. అగ్నిమాపక శాఖ శకటాలతో పాటు విశాఖ పోర్టు అథారిటీ, కోస్టుగార్డు, నేవీలకు చెందిన అత్యాధునిక ఫైర్ ఫైటింగ్ వాహనాలను రంగంలోకి దించారు. సుదీర్ఘ శ్రమ అనంతరం ఎట్టకేలకు సోమవారం వేకువజామున మంటలను అదుపు చేయగలిగారు. మంటలు ఇతర బోట్లకు వ్యాపించకుండా విజయవంతంగా కట్టడి చేశారు.

తప్పిన పెనుముప్పు..

హార్బర్‌లో అగ్నిప్రమాదం సంభవించిన ప్రాంతానికి కొద్దిమీటర్ల దూరంలోనే హిందుస్తాన్ పెట్రోలియంకు చెందిన డీజిల్ బంకరింగ్ ఇన్‌స్టాలేషన్ ఉంది. అక్కడ 365 కిలోలీటర్ల డీజిల్ నిల్వలున్నాయి. అలాగే, హార్బర్ సమీపంలోనే విశాఖ కంటైనర్ టెర్మినల్ ప్రైవేటు లిమిటెడ్ (వీసీటీపీఎల్) కూడా ఉంది. అక్కడ ఇతర దేశాలకు ఎగుమతి చేసే సరుకూ సిద్ధంగా ఉంది. దీంతో ఏదైనా పేలుడు సంభవించి ఆ శకలాలు వచ్చి పడితే ఏం జరుగుతుందోనని ఆందోళన చెందారు. అయితే, అలాంటి ప్రమాదం జరగకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. మరోవైపు.. పోలీసు, అగ్నిమాపక శాఖ, మత్స్యశాఖ, రెవెన్యూ శాఖల అధికారులు రాత్రంతా ప్రమాద స్థలంలోనే ఉంటూ పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించారు.

ఎంపీ, ఎమ్మెల్యేల పరామర్శ

ఘటనా స్థలిని విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, ఎమ్మెల్యేలు వాసుపల్లి గణేష్‌కుమార్, ముత్తంశెట్టి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, మత్స్యశాఖ కార్పొరేషన్ చైర్మన్ పేర్ల విజయచందర్, కలెక్టర్ ఎ. మల్లికార్జున, పోలీస్ కమిషనర్ ఎ. రవిశంకర్, జాయింట్ కలెక్టర్ కేఎస్ విశ్వనాథన్‌లు ఫిషింగ్ హార్బర్‌కు చేరుకుని ప్రమాదం తీరుతెన్నులను పరిశీలించారు. బోటు యజమానులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. మరోవైపు.. టీడీపీ, జనసేన, సీపీఐ, సీపీఐ(ఎం) నాయకులు హార్బర్‌ను సందర్శించారు.

నష్టం తేలగానే పరిహారం: మంత్రి అప్పలరాజు

ఇక ఈ ప్రమాదంపై సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అత్యంత ఉదారంగా స్పందించారని మత్స్యశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు తెలిపారు. ఈ ఘటనలో బోట్లు కాలిపోయిన యజమానులకు వాటిల్లిన నష్టంలో 80 శాతం పరిహారంగా ఇవ్వాలని ఆదేశించారని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆదేశాలతో సోమవారం మధ్యాహ్నం మంత్రి ఘటనాస్థలిని సందర్శించారు. కాలిపోయిన, మునిగిపోయిన బోట్లను పరిశీలించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. ఈ దుర్ఘటన దురదృష్టకరమన్నారు. దగ్ధమైన బోట్ల విలువ నష్టాన్ని అంచనా వేశాక ఆ మొత్తంలో 80 శాతం ప్రభుత్వం తక్షణమే పరిహారంగా చెల్లిస్తుందన్నారు. గతంలో హుద్‌హుద్, తిత్లీ తుపానుల సమయంలోనూ ఈ హార్బర్‌లో బోట్లు దెబ్బతిన్నాయని.. కానీ, అప్పటి ప్రభుత్వం వీరికి నష్టపరిహారం ఇస్తామని హామీ ఇచ్చినా అమలుచేయలేదని ఆయన గుర్తుచేశారు. అందువల్లే ప్రభుత్వ పరిహారంపై నమ్మకంలేక మత్స్యకారుల్లో ఆందోళన నెలకొందన్నారు. కానీ, సీఎం వైఎస్ జగన్ ఇచ్చిన హామీని కచ్చితంగా అమలుచేస్తారని అప్పలరాజు స్పష్టంచేశారు. మంటలను అదుపుచేయడంలో విశాఖ పోర్టు, సీఐఎస్ఎఫ్, నేవీ తదితర సంస్థలు ఎంతో కృషి చేశాయని కొనియాడారు. త్వరలోనే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి స్పష్టంచేశారు.

బాధిత మత్స్యకారులపట్ల

సీఎం జగన్ ఉదారత

బోట్ల విలువలో 80 శాతం పరిహారం ఇవ్వండి

మానవతా దృక్పథంతో సాయం చేయండి	బోట్లకు బీమా లేదనో లేదా వేరే ఇతర సాంకేతిక కారణాలు చెప్పకండి
	భవిష్యత్తులో బోట్లకు బీమా చేయించుకునేలా తోడ్పాటునివ్వండి
	ఇలాంటి కష్టకాలంలోనే వారికి మనం భరోసా కల్పించాలి

సాక్షి, అమరావతి: విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో అగ్నిప్రమాదం కారణంగా బోట్లు కోల్పోయిన మత్స్యకారులకు కనీవినీ ఎరుగని రీతిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహాయం ప్రకటించారు. దగ్ధమైన బోట్ల విలువలో 80 శాతం మేర పరిహారంగా అందించాల్సిందిగా అధికారులను ఆయన ఆదేశించారు. మంత్రి సీదిరి అప్పలరాజు ఘటనా స్థలానికి వెళ్లాలని కూడా సూచించారు. ఈ దుర్ఘటనపై సోమవారం ఉదయం సీఎంఓ అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. సీఎం ఆదేశాల మేరకు మంత్రి సీదిరి అప్పలరాజు సహా జిల్లా కలెక్టర్ ఘటనా స్థలానికి వెళ్లారని.. బాధితులకు పూర్తి భరోసానిచ్చామని వారు చెప్పారు. ప్రమాదంలో 36 బోట్లు దగ్ధం కాగా, మరో 9 బోట్లు పాక్షికంగా దెబ్బతిన్నాయన్నారు. ఈ సందర్భంగా సీఎం జగన్ మాట్లాడుతూ.. ప్రమాదంలో బోట్లు దగ్ధంకావడం మత్స్యకారుల జీవితాలకే పెద్దదెబ్బ అని.. ఇలాంటి పరిస్థితుల్లో వారి జీవితాలను నిలబెటాల్సిన అవసరం ఉందన్నారు. సాయం విషయంలో అత్యంత మానవతా దృక్పథంతో వ్యవహరించాలన్నారు. మానవత్వం అనే పదానికి అర్థం చెబుతూ.. మత్స్యకారుల జీవితాలను తిరిగి నిలబెట్టేలా ఈ సాయం ఉండాలన్నారు. అందుకే ఈ విషయంలో ఉదారంగా ఉండాలని ఆదేశించారు. దగ్ధమైన బోట్ల విలువలో 80శాతం మేర పరిహారంగా ఇవ్వాలని, వారు తిరిగి తమ జీవితాలను నిలబెట్టుకునేలా అండగా ఉండాలన్నారు. బోట్లకు బీమా లేదనో, లేక వేరే ఇతర సాంకేతిక కారణాలను చూపి బాధితుల జీవితాలను గాలికి వదిలేయడం సరికాదన్నారు. ఇలాంటి కష్టం కాలంలోనే వారికి పూర్తి భరోసా కల్పించాల్సిన బాధ్యత మనపై ఉందని సీఎం జగన్ అధికారులకు స్పష్టంచేశారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాద సమయాల్లో ఇబ్బందిలేకుండా బోట్లకు బీమా చేయించుకునేలా అధికారులు తోడ్పాటు అందించాలన్నారు.

రూ.12కోట్ల మేర నష్టం!

ఇక ప్రాథమిక అంచనా ప్రకారం.. బోట్ల దగ్ధం కారణంగా దాదాపు రూ.12 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లుగా భావిస్తున్నారని, అధికారులు తుది నివేదిక సిద్ధంచేస్తున్నారని సీఎంఓ అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.


ఘటనాస్థలిని పరిశీలిస్తున్న మంత్రి సీదిరి అప్పలరాజు